క్లుప్తంగా

ఘనంగా గంగమ్మతల్లి ఆలయ ప్రతిష్ట



మక్కువ: మండలంలోని ఎస్.పెద్దవలస గ్రామం సమీపంలో గంగమ్మతల్లి అమ్మవారి ఆలయ ప్రతిష్ట శుక్రవారం గ్రామస్తులు ఘనంగా నిర్వహించారు. గ్రామం సమీపంలో ఆలయం నిర్మించి, అమ్మవారి విగ్రహాన్ని ఆలయంలో ఏర్పాటుచేశారు. వేదపండితులు మార్తండేయ వేదమంత్రాలతో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయం ఎదుట చండిహోమం, ఆలయ శిఖరాన కలశ ప్రతిష్ట కార్యక్రమం వైభవంగా జరిపించారు. గంగమ్మతల్లిని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు మావుడి రంగునాయుడు దర్శించుకొని, పూజలు చేపట్టారు. పంచాయతీ పరిధిలోని వీరాడవలస, ఎస్.పెద్దవలస, శీబిల్లి, కొత్తకామునివలస, పాతకామునివలస గ్రామాల నుంచి వేలాది మంది భక్తులు పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఆలయ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో అన్నసమారాధన కార్యక్రమం నిర్వహించారు.

వలంటీర్ల రాజీనామా



రాజీనామా పత్రాలను ఎంపీడీఓకు అందజేస్తున్న వలంటీర్లు

సాలూరు రూరల్: మండలంలోని పలు గ్రామ సచివాలయ పరిధిలో సేవలందించిన వలంటీర్లు తమ ఉద్యోగాలకు రాజీనామా చేస్తున్నారు. మరిపల్లి పంచాయతీ నుంచి 8 మంది, తోణాం పంచాయతీ నుంచి 20 మంది వలంటీర్లు శుక్రవారం రాజీనామా చేశారు. ఎంపీడీఓ ఫణీంద్రకుమార్‌కు తమ రాజీనామా పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వలంటీర్లుగా ప్రజలకు సేవ చేసేందుకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి తమకు అవకాశం కల్పించారని, ఇప్పుడు ఎన్నికలు సమీపించడంతో తామంతా రాజీనామాలు చేసి ఎన్నికల ప్రచారంలో పాల్గొని జగనన్నను మరోసారి ముఖ్యమంత్రిని చేసుకుంటామన్నారు.

నేడు ప్రవేశ పరీక్ష

సీతానగరం: మండలంలోని జోగింపేట ఏపీటీడబ్ల్యూఆర్ ఎస్ఓఈ(బి) శనివారం ఉదయం 6వ తరగతితో పాటు 7,8,9 తరగతుల్లో మిగులు సీట్లలో ప్రవేశాలకు ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ పోల వెంకటినాయుడు తెలిపారు. జోగింపేట ఎస్ఓఈ విద్యాలయంలో ఉదయం 11.30 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు పరీక్ష ఉంటుందన్నారు. ప్రవేశ పరీక్షకు 251 మంది దరఖాస్తు చేసుకున్నట్లు తెలిపారు.

'ఫ్రైడే-డ్రైడే' కచ్చితంగా అమలు చేయాలి

- డీఎంఓ డాక్టర్ టి.జగన్మోహనరావు

పార్వతీపురంటౌన్: డ్రైడే పాటించేలా ప్రజల్లో చైతన్యం కలిగించాలని జిల్లా మలేరియా అధికారి డాక్టర్ టి.జగన్మోహనరావు అన్నారు. నర్సిపురంలో వైద్య సిబ్బంది చేపట్టిన 'ఫ్రైడే-డ్రైడే' కార్యక్రమాన్ని శుక్రవారం ఆయన పరిశీలించారు. ఇంటి పరిసరాల్లో మురుగునీటి నిల్వలు, కుండీలు, పాడైన వస్తువులు, రుబ్బురోళ్లు, ప్లాస్టిక్ వస్తువులు తదితర వాటిలో చేరిన మురుగునీటిని పరిశీలించారు. అందులో పెరుగుతున్న దోమల లార్వాలను స్థానికులకు చూపించి, వాటి వల్ల వచ్చే అనారోగ్య సమస్యలపై అవగాహన కల్పించారు. అనంతరం వాటిని పారబోయించారు. ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని, కాలువల్లో చెత్తాచెదారం వేయరాదని సూచించారు. మురుగునీరు ఉన్నట్లయితే అందులో దోమలు వృద్ధి చెంది మలేరియా, డెంగీ, తదితర వ్యాధుల వ్యాప్తికి కారణమవుతాయన్నారు. అనంతరం స్థానిక సచివాలయంలో సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. గ్రామంలో నిర్వహించిన డ్రైడే వివరాలను సంబంధిత యాప్, వెక్టార్ కంట్రోల్ హైజీన్ యాప్‌లో నమోదును పరిశీలించారు. అనంతరం ప్రిజం-10 అమలు తీరుపై ఆరా తీశారు. అడాప్షన్ అధికారులు పర్యవేక్షణ చేస్తున్న గర్భిణులు, బాలింతల వివరాలు తెలుసుకుని పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఏఎంఓ సూర్యనారాయణ, పంచాయతీ కార్యదర్శి ఎం.జగన్మోహనరావు, వైద్య సిబ్బంది ఆదిలక్ష్మి, రాజేశ్వరి, వెంకటరమణ, కృష్ణవేణి, అంగన్‌వాడీ టీచర్ సుందరమ్మ, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

వైభవంగా శ్రీకృష్ణుని సంబరాలు



గెంబలి వారిచే పూజలందుకుంటున్న దేవుళ్లు

వీరఘట్టం: స్థానిక కళింగ వైశ్య సామాజిక వర్గానికి చెందిన గెంబలి వారు ఆధ్వర్యంలో శ్రీకృష్ణుని సంబరాలు శుక్రవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. వందేళ్ల తర్వాత నిర్వహిస్తున్న ఈ సంబరాలను అత్యంత వైభవంగా చేపట్టేందుకు ఉత్సవ కమిటీ ముమ్మర ఏర్పాట్లు చేశారు. మూడు రోజుల పాటు ఈ ఉత్సవాలు జరగనున్నాయి. దీంతో సమీప గ్రామాల నుండి వీరి బంధువులు పెద్ద ఎత్తున వీరఘట్టం రావడంతో స్థానిక గెంబలివీధిలో సందడి నెలకొంది.



గిరిశిఖర గ్రామం దోయివరలో నిర్మించిన కుళాయిలు





ఇంటి వద్దకే తాగునీరు

- కోట్లాది రూపాయలతో ఇంటింటికీ కుళాయిల ఏర్పాటు
- వేసవిలో కూడా పూర్తిస్థాయిలో నీటి సరఫరా



గిరిశిఖర గ్రామం పట్టుచెన్నేరులో నిర్మించిన కుళాయిలను పరిశీలిస్తున్న ఐటీడీఏ పూర్వ పీఓ విష్ణుచరణ్



సాలూరు: గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇచ్చింది. పట్టణాలతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు తాగునీరు ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టింది. కోట్లాది రూపాయలు ఖర్చుచేసి తాగునీటి వనరులను మెరుగుపరిచింది. పాచిపెంట మండలంలో పెద్దగెడ్డ రిజర్వాయర్ నుంచి, మక్కువ మండలంలో రెండు సీపీడబ్ల్యూఎస్ పథకాల ద్వారా 28 పంచాయతీల్లో సుమారు 107 గ్రామాలకు తాగునీరు అందించింది. జలజీవన్ మిషన్ కింద ఇంటింటికీ తాగునీటి కుళాయిలు ఏర్పాటు పనులు చివరిదశకు చేరుకున్నాయి. గిరిశిఖర గ్రామాల్లో 20 బావులు నిర్మించారు. గ్రామాల్లో పాడైన తాగునీటి బోర్ల మరమ్మతులకు 'క్యాష్ ప్రోగ్రాం' అమలు చేస్తోంది. ప్రభుత్వ ముందస్తు చర్యల కారణంగా వేసవిలో కూడా ప్రజలకు పూర్తిస్థాయిలో నీరు సరఫరా అవుతోంది.

మున్సిపాలిటీలో..

మున్సిపాలిటీ పరిధిలో 3800 కుళాయి కనెక్షన్ల ద్వారా ప్రతిరోజు తాగునీరు సరఫరా చేస్తున్నారు. ఇవికాక 80 పైలెట్ వాటర్ స్కీంలు, 200 చేతి బోర్లు ఉన్నాయి. వేసవి ఎద్దడి దృష్ట్యా అవసరమైన చోట 5 వాటర్ ట్యాంక్‌ల ద్వారా నీటిని అందిస్తున్నారు. పాడైన బోర్లను వెంటనే మరమ్మతులు చేసేందుకు సుమారు రూ.5 లక్షలతో మెటీరియల్ సిద్ధం చేశారు. పట్టణ వాసులకు పాచిపెంట పెద్దగెడ్డ రిజర్వాయర్ నుంచి తాగునీరు సరఫరాకు సుమారు రూ.69 కోట్ల ఏఐబీ నిధులను ఉపముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర మంజూరు చేయించారు.

నిరీక్షణకు చెక్..

గత టీడీపీ ప్రభుత్వంలో చుక్క నీటి కోసం కిలోమీటర్ల దూరం వెళ్లాల్సిన పరిస్థితి, చలమల వద్ద గంటల తరబడి నిరీక్షించాల్సిన దుస్థితి. గిరిశిఖర గ్రామాల ప్రజలు కొండవాగుల నుంచి వచ్చే ఊట నీటిని గొట్టాల ద్వారా పట్టుకుని బతుకు జీవుడా అంటూ అతికష్టం మీద తమ గ్రామాలకు మోసుకుంటూ వెళ్లేవారు. కలుషిత నీరు తాగి వ్యాధుల బారిన పడిన సంఘటనలు ఉన్నాయి. అయితే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కోట్లాది రూపాయలు ఖర్చుచేసి ఇంటింటికీ తాగునీటి కుళాయిలు ఏర్పాటు చేసింది. ఇప్పుడు నీటి కోసం కిలోమీటర్ల దూరం వెళ్లాల్సిన పరిస్థితి లేదు. సెలమల నీటిని తాగాల్సిన దుస్థితి అంతకంటే లేదు. కుళాయిల ద్వారా ఇంటి వద్దకే స్వచ్ఛమైన నీటిని సరఫరా చేస్తున్నారు.



టీడీపీ ప్రభుత్వంలో చెలమ వద్ద కలుషిత నీరు పట్టుకుంటున్న గిరిజనులు(ఫైల్)



టీడీపీ పాలనలో తాగునీటికి ఇబ్బందులు పడుతున్న గిరిజనులు(ఫైల్)

మళ్లీ వచ్చేది జగనన్న ప్రభుత్వమే..



పార్వతీపురం టౌన్: 27వ వార్డులో ఇంటింటి ప్రచారంలో పాల్గొన్న ఎమ్మెల్యే జోగారావు

- ప్రజల మద్దతు వైఎస్సార్‌సీపీకే..
- ఐదేళ్లలో అందించిన సంక్షేమం, అభివృద్ధి చూసి ఓటు వేయండి
- ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే అలజంగి జోగారావు



సీతానగరం: ఎమ్మెల్యే జోగారావుకు విజయతిలకం దిద్ది, హారతిస్తున్న మహిళలు

పార్వతీపురం టౌన్: ప్రజా మద్దతుతో మళ్లీ గెలిచి నిలిచేది వైఎస్సార్‌సీపీ ప్రభుత్వమేనని ఎమ్మెల్యే అలజంగి జోగారావు అన్నారు. పార్వతీపురం పట్టణంలోని 27వ వార్డు, జగన్నాథపురం కాలనీల పరిధిలో స్థానిక నాయకులతో కలిసి శుక్రవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. గడపగడపకు వెళ్లి ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీచేస్తున్న తనకు మద్దతివ్వాలని కోరారు. మే 13న జరిగే పోలింగ్‌లో ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి తనను గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు.

నియోజకవర్గంలో రూ.1540 కోట్లతో అభివృద్ధి చేశాం

గత ఐదేళ్ల కాలంలో నియోజకవర్గంలో అభివృద్ధి, సంక్షేమానికి రూ.1540 కోట్లు ఖర్చుచేశామని ఎమ్మెల్యే జోగారావు అన్నారు. పార్టీలకు అతీతంగా ప్రతీ ఇంటికి సంక్షేమ పథకాలు అందించామన్నారు. విద్య, వ్యవసాయం, వైద్య రంగాలకు ప్రాధాన్యం ఇస్తూ అనేక అభివృద్ధి కార్యక్రమాలు అమలు చేశారని అన్నారు. మోసపూరిత హామీలతో టీడీపీ అధినేత చంద్రబాబు మళ్లీ ఎన్నికలకు వస్తున్నారని, టీడీపీ నేతల మాటలు నమ్మితే మోసపోతారని అన్నారు. వైఎస్సార్‌సీపీ పాలనలో జరిగిన లబ్ధిని ప్రతీ లబ్ధిదారుడు గుర్తుంచుకోవాలని కోరారు. సంక్షేమం, అభివృద్ధి కొనసాగాలంటే ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి అఖండ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ఏపీ టిడ్కో చైర్మన్ జమ్మాన ప్రసన్నకుమార్, పార్టీ పట్టణ అధ్యక్షుడు కొండపల్లి బాలకృష్ణ, పార్టీ ఫ్లోర్‌లీడర్ మంత్రి రవికుమార్, వైస్ చైర్మన్ యిండుపూరు గున్నేశ్వరరావు, వార్డు కౌన్సిలర్ సువ్వాడ లావణ్య, జేసీఎస్ కన్వీనర్ గొర్లి మాధవరావు, రణభేరి చిన్నంనాయుడు, నిమ్మకాయల సుధీర్‌కుమార్, ఎడ్ల త్రినాథ, బొత్స ఆనంద్, జె.దివ్య, పి.జయంతి, గోగు గాయత్రి పాల్గొన్నారు.

జగనన్నను మళ్లీ సీఎంను చేద్దాం..

సీతానగరం: రాజకీయాలకు అతీతంగా అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలు అందించిన జగనన్నను రెండోసారి ముఖ్యమంత్రిని చేసేందుకు ఈ ఎన్నికల్లో మనమంతా ఫ్యాన్ గుర్తుపై ఓటు వేద్దామని ఎమ్మెల్యే జోగారావు పిలుపునిచ్చారు. మండలంలోని రామవరం పంచాయతీ రెడ్డివానివలసలో పార్టీ నాయకులతో కలిసి శుక్రవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ఐదేళ్లలో చేసిన సంక్షేమాన్ని, అభివృద్ధిని వివరించారు. ఫ్యాన్ గుర్తుపై ఓటువేసి తనను ఎమ్మెల్యేగా, తనూజారాణిని ఎంపీగా భారీ మెజార్టీతో గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. గడపగడపలో ఎమ్మెల్యేకు అపూర్వ ఆదరణ లభించింది. మహిళలు హారతులు ఇచ్చి స్వాగతం పలికారు. ప్రచారంలో జెడ్పీటీసీ ఎం.బాబ్జీ, పార్టీ సీనియర్ నాయకుడు బి.శ్రీరాములునాయుడు, పార్టీ మండల అధ్యక్షుడు బి.చిట్టిరాజు, స్థానిక నాయకులు రెడ్డి తవిటినాయుడు, డీసీసీబీ డైరెక్టర్ అంబటి కృష్ణంనాయుడు, బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ ఎస్.తిరుపతిరావు, సీడీసీ మాజీ చైర్మన్ ఎస్.రామకృష్ణ, పార్టీ మండల నాయకులు పార్థసారథి, పెంట సూర్యనారాయణ, పి.ఈశ్వరనారాయణ, పీఎస్ఎన్, తెంటు శంకరరావు, వి.దానబాబు, పలు గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, నాయకులు పాల్గొన్నారు.

టీడీపీ నుంచి బోనెల నామినేషన్

పార్వతీపురంటౌన్: పార్వతీపురం అసెంబ్లీ స్థానానికి టీడీపీ నుంచి బోనెల విజయచంద్ర, స్వతంత్ర్య అభ్యర్థిగా(టీడీపీ రెబల్) గర్భాపు ఉదయభాను శుక్రవారం నామినేషన్లు వేశారు. ఆర్డీఓ కార్యాలయంలో ఎన్నికల అధికారి కె.హేమలతకు ఒక్కో సెట్ నామినేషన్ పత్రాలు అందజేశారు. నామినేషన్ల సందర్భంగా ఆర్వో కార్యాలయం వద్ద పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. కార్యాలయానికి వంద మీటర్ల దూరంలో అభ్యర్థుల వాహనాలు నిలిపివేశారు. నామినేషన్ పత్రాలు సమర్పించేందుకు అభ్యర్థితో పాటు ఐదుగురిని మాత్రమే అనుమతించారు. అభ్యర్థులకు అవసరమైన సూచనలు చేసేందుకు హెల్ప్‌డెస్క్‌ను కూడా ఏర్పాటు చేశారు.

సాలూరులో..

సాలూరు: సాలూరు అసెంబ్లీ స్థానానికి శుక్రవారం మూడు సెట్లు నామినేషన్లు దాఖలైనట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి తెలిపారు. వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా పీడిక రాజన్నదొర ఒక సెట్, టీడీపీ అభ్యర్థిగా గుమ్మడి సంధ్యారాణి రెండు సెట్ల నామినేషన్లు దాఖలు చేశారు. ప్రధాన పార్టీల అభ్యర్థులు నామినేషన్లు వేయడంతో నియోజకవర్గంలో ఎన్నికల వేడి పెరిగింది.

అరకు పార్లమెంట్ స్వతంత్ర్య అభ్యర్థిగా నిమ్మక నామినేషన్

పార్వతీపురం/పార్వతీపురంటౌన్: ఆదివాసీలకు న్యాయం చేసేందుకే అరకు పార్లమెంట్ అభ్యర్థిగా నామినేషన్ వేసినట్లు మాజీ ఎమ్మెల్యే, ఆదివాసీ జేఏసీ చైర్మన్ నిమ్మక జయరాజ్ అన్నారు. శుక్రవారం కలెక్టర్ కార్యాలయంలో ఎన్నికల రిటర్నింగ్ అధికారి నిషాంత్ కుమార్‌కు నామినేషన్ పత్రాన్ని సమర్పించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. 15 ఏళ్లుగా టీడీపీలో ఉన్నానని, నాగూరు నియోజకవర్గ ఎమ్మెల్యేగా పనిచేశానని అన్నారు. గత పదేళ్లుగా బీజేపీలో సేవలందిస్తున్నానని, అరకు పార్లమెంట్ సీటు ఆశించానని, కానీ బీజేపీ, జనసేన, టీడీపీ కూటమిలో భాగంగా అధిష్టానం బీజేపీ తరఫున కొత్తపల్లి గీతకు టికెట్ కేటాయించిందన్నారు. బీజేపీ ఎంపీ అభ్యర్థి నిజమైన గిరిజనురాలు కాదని, దీనిపై పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు పురంధేశ్వరికి పలు మార్లు ఫిర్యాదు చేసినప్పటికీ ఆమె పరిగణలోకి తీసుకోకుండా ఏకపక్షంగా గీతకు టికెట్ కేటాయించారన్నారు. దీని వల్ల రాష్ట్రంలో 32 లక్షల మంది గిరిజనులకు అన్యాయం జరుగుతుందన్నారు. గిరిజన ప్రాంతానికి న్యాయం చేయాలనే ఉద్దేశంతోనే స్వతంత్ర్య అభ్యర్థిగా నామినేషన్ వేసినట్లు తెలిపారు. బీజేపీ రాష్ట్ర, కేంద్ర కమిటీ సభ్యులు గిరిజనులకు న్యాయం చేసే విషయంలో పునరాలోచన చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

మాతా శిశు ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి

- డీఎంహెచ్ఓ డాక్టర్ బి.జగన్నాథరావు



మాట్లాడుతున్న డీఎంహెచ్ఓ డాక్టర్ బి.జగన్నాథరావు

సీతానగరం: మాతా, శిశు ఆరోగ్య వివరాలు పక్కాగా నమోదు చేయాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ బి.జగన్నాథరావు ఆదేశించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సీతానగరం, బలిజిపేట మండలాలకు చెందిన పీహెచ్‌సీల వైద్యాధికారులు, వైద్య సిబ్బందితో శుక్రవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్ఓ మాట్లాడుతూ.. గర్భిణులకు చేపడుతున్న ఆరోగ్య తనిఖీలు, వైద్య పరీక్షల వివరాలు మాతాశిశు సంరక్షణ కార్డులో, సంబంధిత పోర్టల్‌లో ఆన్‌లైన్ చేయాలని సూచించారు. తద్వారా హైరిస్క్ గర్భిణుల ఆరోగ్యాన్ని నిశితంగా పర్యవేక్షించవచ్చన్నారు. పీహెచ్‌సీల్లో సాధారణ కాన్పులు జరిగేలా చూడాలన్నారు. కాన్పు తర్వాత మాతా శిశు ఆరోగ్య పర్యవేక్షణపై దృష్టి సారించాలన్నారు. ప్రిజం-10 పక్కగా అమలు చేయాలని సూచించారు. వేసవిలో వడదెబ్బకు గురికాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. జిల్లా మలేరియా అధికారి(డీఎంఓ) డాక్టర్ టి.జగన్మోహనరావు, ఎఫ్‌డీపీ ప్రోగ్రాం అధికారి డాక్టర్ ఎం.వినోద్, ఎపిడిమాలజిస్ట్ డాక్టర్ శ్రీధర్ పాల్గొన్నారు.

రూ.32.5 లక్షలతో ఇంటింటి కుళాయిలు

సీతానగరం: మండలంలోని చినబోగిలి గ్రామంలో ప్రజల అవసరాలకు అనుగుణంగా తాగునీరు వసతులు కల్పించేందుకు పనులు చేపడుతున్నామని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ఆర్.పవన్‌కుమార్ అన్నారు. చినబోగిలిలో జరుగుతున్న ప్రధాన పైప్‌లైన్ పనులను, ఇంటింటి కుళాయి పనులను శుక్రవారం ఆయన పరిశీలించారు. నాణ్యతా ప్రమాణాలకు లోబడి పనులు చేయాలని సిబ్బందికి సూచించారు. ప్రభుత్వం జలజీవన్ మిషన్ పథకం ద్వారా రూ.24 లక్షలు, గడపగడపకు మన ప్రభుత్వం నిధులు రూ.6 లక్షలు, గ్రామ పంచాయతీ నిధులు రూ.1.5 లక్షలతో గ్రామంలోని ప్రతీ ఇంటికి ట్యాప్‌లు వేసేందుకు ప్రణాళికలు రూపొందించామన్నారు. ప్రస్తుతం 550 కుళాయి ట్యాప్‌ల ఏర్పాటు పూర్తయినట్లు చెప్పారు. వాటర్‌ట్యాంక్ నుంచి ప్రధాన పైప్‌లైన్ కనెక్షన్ పనులు జరుగుతున్నాయన్నారు. త్వరలోనే పనులు పూర్తిచేసి ఇంటింటికీ తాగునీరు సరఫరా చేస్తామన్నారు.

తొలిసెట్ నామినేషన్ వేసిన రాజన్నదొర



నామినేషన్ సమర్పించేందుకు ఆర్వో కార్యాలయంలో నిరీక్షిస్తున్న రాజన్నదొర

సాలూరు: సాలూరు అసెంబ్లీ నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా పీడిక రాజన్నదొర శుక్రవారం తొలిసెట్ నామినేషన్ వేశారు. ఉదయం 10.20 గంటల సమయంలో పట్టణంలో తన స్వగృహం నుంచి రాజన్నదొర బయలుదేరగా.. తన భార్య రోజమ్మ ఎదురువచ్చి విజయతిలకం దిద్ది హారతిచ్చారు. అనంతరం పార్టీ నాయకులు, కార్యకర్తలతో ర్యాలీగా ఆర్వో కార్యాలయానికి వెళ్లారు. మున్సిపల్ చైర్‌పర్సన్ పువ్వల ఈశ్వరమ్మ, వైస్ చైర్‌పర్సన్ జర్జాపు దీప్తి, వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు రెడ్డి పద్మావతి, ఏఎంసీ చైర్‌పర్సన్ దండి అనంతకుమారితో కలిసి నామినేషన్ పత్రాలను ఆర్వో, ఐటీడీఏ పీఓ విష్ణుచరణ్‌కు అందజేశారు. అనంతరం పట్టణంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ప్రతి ఒక్కరినీ ఆప్యాయంగా పలకరిస్తూ.. మే 13న జరిగే ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓటు వేయాలని కోరారు. దారిపొడవునా రాజన్నదొరకు ప్రజలు బ్రహ్మరథం పట్టారు. పూలతో స్వాగతం పలికారు. మా ఓటు నీకే రాజన్నా.. అంటూ మనస్ఫూర్తిగా చెప్పారు. జై జగన్, జై రాజన్నదొర నినాదాలు చేస్తూ మద్దతు తెలిపారు.



ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే అభ్యర్థి పీడిక రాజన్నదొర

వైఎస్సార్‌సీపీలో భారీగా చేరికలు



ఎమ్మెల్యే జోగారావు సమక్షంలో పార్టీలో చేరిన యువత

పార్వతీపురంటౌన్: టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలోకి వలసలు పెరుగుతున్నాయి. మండలంలోని తాళ్లబురిడి గ్రామానికి చెందిన పలువురు టీడీపీ కార్యకర్తలు శుక్రవారం వైఎస్సార్‌సీపీ తీర్థం పుచ్చుకున్నారు. స్థానిక ఎమ్మెల్యే అలజంగి జోగారావు వారికి కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందించిన సంక్షేమ పాలనకు ఆకర్షితులై ప్రతిపక్ష పార్టీ కార్యకర్తలు, సానుభూతిపరులు పెద్ద ఎత్తున వైఎస్సార్‌సీపీలో చేరుతున్నారని అన్నారు. మనమంతా ఒక కుటుంబంలా కలిసిమెలసి పనిచేసి జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిని చేసుకుందామని, ఈ ప్రాంతాన్ని మరింత అభివృద్ధి చేసుకుందామని పిలుపునిచ్చారు. రానున్న ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి తనను ఎమ్మెల్యేగా గెలిపించాలని కోరారు.

సొంత గూటికి చేరిన పండు

మండలంలోని ఎం.ఆర్.నగరం గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు పండు టీడీపీని వీడి వైఎస్సార్‌సీపీలో చేరారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే జోగారావు ఆయనకు పార్టీ కండువా వేసి ఆహ్వానించారు. ఈ సందర్భంగా పండు మాట్లాడుతూ.. తనకి ఇష్టం లేకపోయినా సరే సర్పంచ్ బలవంతంతో టీడీపీ కండువా వేసుకోవాల్సి వచ్చిందన్నారు. ఆ పార్టీలో ఉండటం ఇష్టం లేక తిరిగి సొంతగూటికి చేరినట్లు చెప్పారు. వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిగా, అలజంగి జోగారావుని ఎమ్మెల్యే మరోసారి గెలిపించుకునేందుకు శక్తివంచన లేకుండా పనిచేస్తానని అన్నారు.



వైఎస్సార్‌సీపీలో చేరిన తాళ్లబురిడి గ్రామస్తులు



సొంతగూటికి చేరిన ఎం.ఆర్.నగరం నాయకుడు పండు

పార్వతీపురంటౌన్: పట్టణంలోని పలువురు యువతీ, యువకులు శుక్రవారం వైఎస్సార్‌సీపీలో చేరారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే అలజంగి జోగారావు వారికి కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. 58 నెలలుగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పేదలకు అందించిన సంక్షేమాన్ని, నియోజకవర్గంలో ఎమ్మెల్యే జోగారావు చేసిన అభివృద్ధి పనులను కళ్లారా చూశామని, మళ్లీ వారిని గెలిపించుకునేందుకు తమవంతు కృషిచేస్తామని వారంతా చెప్పారు.